**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేది: 11.05.2026** **సమయం: 12.30 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. సోమనాథ్ ఆలయం అచంచలమైన విశ్వాసానికి, దైవత్వానికి నిలయమని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
2. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశాన్ని బలోపేతం చేయడంలో దేశప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
3. ఈరోజు జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా దేశంలోని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలకు – ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, రక్షణ మంత్రి, హోం మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.
4. ఐపీఎల్ క్రికెట్ లో భాగంగా ఈరోజు ధర్మశాలలో జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ - ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడుతాయి.

**PM-SOMNATH**

సోమనాథ్ అమృత్ పర్వ్ సందర్భంగా, మొదటి జ్యోతిర్లింగమైన సోమనాథ్ మహాదేవ ఆలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక మహాపూజ నిర్వహించారు. సోమనాథ్ ఆలయ శిఖరంపై కుంభాభిషేక క్రతువును పూర్తి చేశారు. 11 పుణ్యక్షేత్రాల నుండి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో ఆలయ శిఖరానికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ మోదీ... సోమనాథ్ ఆలయం అచంచలమైన విశ్వాసానికి, దైవత్వానికి నిలయమని, దేశం శాశ్వత ఆత్మకు పవిత్ర చిహ్నమని కొనియాడారు. ఎన్నిసార్లు దాడులు ఎదురైనప్పటికీ సోమనాథ్ ఆలయం మళ్లీ మళ్లీ ఉద్భవించిందని, ఇది భారతదేశం అజేయమైన శక్తిని, ఆత్మగౌరవాన్ని

ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం దేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పునాది అని ఆయన ఉద్ఘాటించారు.

**బైట్ ... ప్రధానమంత్రి మోదీ, సోమనాథ్**

అంతకుముందు, భారత వైమానిక దళం నిర్వహించిన ఎయిర్ షోలో 'సూర్యకిరణ్ ఏరోబాటిక్స్ టీమ్' సోమనాథ్ గగనతలంలో విన్యాసాలను ప్రదర్శించింది. హెలికాప్టర్ల ద్వారా ఆలయంపై పుష్పాలు కురిపించారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను సందర్శించారు.

**NSD**

## RAJNATH - SOMNATH SWABHIMAN UTSAV

సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'సోమనాథ్ స్వాభిమాన్ ఉత్సవ్' నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉత్సవం భారతదేశ నిరంతర శక్తికి నిదర్శనమని సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. సోమనాథ్ ఆలయాన్ని భారతదేశ ఆధ్యాత్మిక చైతన్యానికి, విశ్వాసానికి శక్తివంతమైన చిహ్నంగా ఆయన అభివర్ణించారు.

**NSD**

## PM- NATION 7 APPEAL

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశాన్ని బలోపేతం చేయడంలో దేశప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నిన్న హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి... దేశ ప్రజలకు ఏడు విజ్ఞప్తులు చేశారు. ప్రజా రవాణా వాడటం, కార్ పూలింగ్ ద్వారా దిగుమతి చేసుకునే ఇంధన వినియోగాన్ని తగ్గించి, తద్వారా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడాలని ఆయన ప్రజలను కోరారు. ఒక ఏడాది పాటు విదేశీ ప్రయాణాలను నివారించి, ఖర్చులు తగ్గించుకోవాలని ప్రజలను కోరారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ చేసుకోవడాన్ని పునఃపరిశీలించడం, ఒక సంవత్సరం పాటు మితిమీరిన బంగారం కొనుగోళ్లను పరిమితం చేయడం వంటి మార్గాల ద్వారా విదేశీ ఖర్చులను తగ్గించాలని కూడా విజ్ఞప్తి చేశారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలను మళ్ళీ

ప్రారంభించాలని మోదీ పిలుపునిచ్చారు. వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకూ, విదేశాల నుండి దిగుమతి చేసుకునే రసాయనిక ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించాలని రైతులకూ విజ్ఞప్తి చేశారు. 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమానికి మద్దతు తెలుపుతూ, 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడానికి స్వయం సమృద్ధి, సేంద్రీయ వ్యవసాయం అత్యవసరమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు.

**NSD**

**VP - TECH DAY**

ఈరోజు జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా దేశంలోని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలు పరిశోధకులకు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. 1998లో సరిగ్గా ఇదే రోజున, భారత్ తన అద్భుతమైన శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని ఉపరాష్ట్రపతి అన్నారు. మన ప్రజల ప్రతిభ, అంకితభావంతో విజ్ఞాన శాస్త్రం, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాలలో దేశం మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని రాధాకృష్ణన్ ఆకాంక్షించారు.

**NSD**

**PM-TECH DAY**

1998లో పోఖ్రాన్ అణు పరీక్షలు విజయవంతం కావడానికి కారకులైన శాస్త్రవేత్తల కృషిని, అంకితభావాన్ని భారత్ గర్వంగా స్మరించుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

**NSD**

**RAJNATH-TECH DAY**

పోఖ్రాన్ నుండి అంతరిక్ష రంగం, డిజిటల్ ఆవిష్కరణలు, రక్షణ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో సాధించిన పురోగతి వరకు, భారతదేశ ప్రయాణం జ్ఞానం, స్వయం సమృద్ధి శక్తిని ప్రతిబింబిస్తుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చెప్పారు.

**NSD**

**SHAH-TECH DAY**

అనేక విప్లవాత్మకమైన కార్యక్రమాల ద్వారా వినూత్న నైపుణ్యాలను ఉపయోగించుకుంటూ ప్రభుత్వం భారతదేశ వృద్ధిని ముందుకు నడిపిస్తోందని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

**NSD**

**JITENDRA SINGH-TECH DAY**

జాతీయ సాంకేతిక దినోత్సవం, శాస్త్రీయ ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతి విజ్ఞానం, సమాజం, పరిశ్రమల మధ్య ఉన్న సమన్వయం పట్ల దేశానికి ఉన్న నిబద్ధతను చాటిచెబుతుందని శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

**NSD**

**ASSAM - HIMANTA GOVT**

అస్సాంలో బీజేపీ నేతృత్వంలోని NDA శాసనసభ పక్ష నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన హిమంత బిశ్వశర్మను కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆహ్వానించారు. కొత్త మంత్రివర్గ సభ్యుల చేత గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ - రేపు పదవీ స్వీకార ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమం ఖానాపారాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో జరుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని భావిస్తున్నారు.

**NSD**

**SBI REPORT-GDP**

ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడగా కొనసాగుతోందని ఎస్‌బీఐ పరిశోధన నివేదిక పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.6 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. అలాగే, గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి దాదాపు 7.2 శాతంగా ఉండవచ్చని ఈ నివేదిక అంచనా వేసింది.

**NSD**

**IPL CRICKET**

ఐపీఎల్ క్రికెట్ లో భాగంగా ఈరోజు ధర్మశాలలో జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడుతాయి. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుంది.

కాగా, నిన్న రాత్రి రాయ్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**NSD**

## IMD-WEATHER

గుజరాత్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో ఈరోజు వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతాలలో రాబోయే 3-4 రోజులలో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది.. కొంకణ్, గోవాలోని కొన్ని ప్రాంతాలలో పగటిపూట వేడి, తేమతో కూడిన వాతావరణం కొనసాగే అవకాశం ఉండగా, రాజస్థాన్‌లో రాత్రిపూట వెచ్చని వాతావరణం నెలకొంటుందని తెలిపింది.